క్లుప్తంగా

అంబాపురంలో ఉద్రిక్తత

నెల్లూరు రూరల్: నగర శివారు అంబాపురం సమీపంలోని స్థలాల వద్ద మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. రెవెన్యూ అధికారుల ఆదేశాలతో ఈ ప్రాంతంలో పోలీస్ బలగాలను మోహరించారు. వివరాలు.. ఈ ప్రాంతంలో ఖాళీగా ఉన్న స్థలాల్లో నెల క్రితం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పలు దళిత సంఘాలకు చెందిన వారు గుడిసెలు వేశారు. ఎలాంటి అనుమతుల్లేకుండా గుడిసెలు వేయడంపై రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో పలువురు ఎమ్మార్పీఎస్ నేతలు, తదితరులపై వేదాయపాళెం పోలీస్‌స్టేషన్లో కేసులు నమోదు చేశారు. భూములకు సంబంధించిన వ్యవహారం కోర్టులో నడుస్తోంది. ఈ నేపథ్యంలో పలు ప్రాంతాలకు చెందిన వారు ఇదే ప్రాంతంలో ఖాళీగా ఉన్న స్థలాల్లో గుడిసెలు వేసేందుకు యత్నించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గుడిసెలు వేయొద్దని హెచ్చరించారు. గతంలో గుడిసెలు వేసుకున్న వారు.. ప్రస్తుతం వేసిన వారికి మధ్య కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. ఇరువర్గాలకు సర్దిచెప్పి వెళ్లిపోవాలని సూచించారు. స్థలాల వద్ద ఇరువర్గాలు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న షామియానాలను పోలీసులు తొలగించారు. కాగా రెవెన్యూ రికార్డులను అనుసరించి తగు చర్యలను చేపట్టనున్నామని రూరల్ ఇన్‌చార్జి తహసీల్దార్ సుబ్బయ్య తెలిపారు.

ఆత్మహత్య ఘటనపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): రైలు కిందపడి ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటనపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. జనార్దన్‌రెడ్డికాలనీకి చెందిన ఏసుదాస్ (53) తన వ్యక్తిగత అవసరాల నిమిత్తం సంతపేటలోని ఉప్పరపాళేనికి చెందిన ఓ తండల్‌వ్యాపారి వద్ద నగదును అప్పుగా తీసుకున్నారు. వ్యాపారి వేధింపులను తాళలేకపోతున్నానని లేఖ రాసి ఈ ఏడాది ఫిబ్రవరిలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే తండల్ తీసుకున్న ప్రాంతం, మృతుడు వేధింపులకు గురైన ప్రాంతం సంతపేట పోలీస్‌స్టేషన్ పరిధి అని తేలింది. దీంతో సంతపేట పోలీస్‌స్టేషన్‌కు కేసును బదిలీ చేస్తూ జిల్లా పోలీస్ కార్యాలయానికి గుంతకల్ రైల్వే ఎస్పీ ఉత్తర్వులను ఇటీవల పంపారు. కేసు నమోదు చేయాలని పోలీస్ కార్యాలయం నుంచి సంతపేట పోలీసులకు ఉత్తర్వులు అందాయి. దీంతో ఎస్సై వేణుగోపాల్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

అత్తింటి ముందు బాలింత నిరసన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): కాన్పు కోసం పుట్టింటికెళ్లి తిరిగొచ్చిన బాలింతను రానివ్వకుండా ఇంటి బయట గేట్‌కు అత్తింటివారు తాళం వేశారు. దీంతో దిక్కుతోచని స్థితిలో బాధితురాలు తన భర్త కోసం మూడు రోజులుగా పడిగాపులు కాస్తున్న ఘటన వెంకటేశ్వరపురంలో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు.. తోటపల్లిగూడూరుకు చెందిన పవిత్రకు వెంకటేశ్వరపురంలోని చిన్న మసీదు వీధికి చెందిన నారాయణరావుతో 2020లో వివాహమైంది. నారాయణరావుకు గతంలో వివాహం జరిగి.. భార్య మృతి చెందిన విషయాన్ని గోప్యంగా ఉంచారు. ఈ క్రమంలో ప్రసవం నిమిత్తం పుట్టింటికి గతేడాది పవిత్ర వెళ్లారు. బిడ్డకు మూడో నెల రావడంతో అత్తింటికి ఆదివారం వచ్చారు. అయితే ఆమెను ఇంట్లోకి రానివ్వకుండా దూరం పెట్టారు. పవిత్రను ఇంటి నుంచి బయటకు నెట్టేసి అత్త కామేశ్వరమ్మ, ఆడబిడ్డ సాయిలత గేట్‌కు తాళం వేసి మంగళవారం వెళ్లిపోయారు. దీంతో ఆమె నిరసన చేపట్టారు.

హుండీ కానుకల లెక్కింపు



బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయ హుండీ కానుకలను మంగళవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు మాట్లాడుతూ గతేడాది డిసెంబర్ 12వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 28వ తేదీ వరకు అనగా 113 రోజులకు గాను హుండీ కానుకలను లెక్కించినట్లు తెలిపారు. రూ.52,56,345ల నగదు రాగా, 146 గ్రాముల బంగారు వస్తువులు, 240 గ్రాముల వెండి వస్తువులు వచ్చాయన్నారు. యూఎస్‌ఏ డాలర్లు 21, కెనడా డాలర్లు 15, మలేసియా రింగేట్స్ 1, సౌతాఫ్రికా ర్యాండ్స్ 10,000 హుండీ ద్వారా భక్తులు సమర్పించినట్లు తెలిపారు. దీంతో పాటు అన్నదాన హుండీ ద్వారా రూ.2,24,472 వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఈఓ వెంకటసుబ్బయ్య, పాలకమండలి సభ్యులు నందకుమార్, శివకుమార్, శశిశేఖర్‌శర్మ, బ్యాంక్ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

ప్రాణమున్నంత వరకు జగనన్నతోనే

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వచ్చే ఎన్నికల్లో తనకు పార్టీ టికెట్ ఇచ్చినా.. ఇవ్వకపోయినా ప్రాణమున్నంత వరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటానని, ఆయన బొమ్మ తన ఇంట్లో జీవితాంతం ఉంటుందని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 44వ డివిజన్లో గల పెద్దబజార్, బెస్తవీధి, అంజుమన్ వీధి, యాసిన్ వీధి, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించిన ఆయన మాట్లాడారు. పార్టీ గుర్తు లేకపోతే ఎవరైనా సింగిల్ డిజిట్‌కే పరిమితమవుతారని ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి చెప్పానన్నారు. 60 ఏళ్ల కంటే పైగా అనుభవం ఉన్న వారు సైతం ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తే ఐదారు వేల ఓట్లతో ఆగిపోయారని.. అదే పార్టీ గుర్తుతో పోటీ చేస్తే 50 వేల నుంచి 60 వేల ఓట్లు వస్తాయని తాను మొదట్నుంచి చెప్తున్నానని తెలిపారు. తనకు అసలు టికెట్ ఇస్తారా అంటూ ఆయన మాట్లాడటం సరికాదని సూచించారు. తనకు ఇవ్వకపోయినా.. వేరొకరికి ఇస్తానని సీఎం చెప్పినా అభ్యర్థి విజయానికి ఒక సామాన్య కార్యకర్తలా పనిచేస్తానని తెలిపారు. అసలు ఏ పార్టీలో సీటు ఉండదనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని చంద్రశేఖర్‌రెడ్డికి సూచించారు. మీ ముగ్గురూ శాసనసభకు రారని స్పష్టం చేశారు. వీరిలో ఏ ఒక్కరైనా అసెంబ్లీలో అడుగుపెడితే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకొని, జిల్లాలో అడుగుపెట్టనని సవాల్ విసిరారు. అనవసరంగా ఏదేదో మాట్లాడటం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ రాఘవరావు, తదితరులు పాల్గొన్నారు.

అపోహలు సృష్టించడం తగదు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ప్రజల్లో అపోహలు కల్పించే మాటలను ఇప్పటికైనా మానుకోవాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 42వ డివిజన్లో గల ఖుద్దూస్‌నగర్, మన్సూర్‌నగర్ ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించిన ఎమ్మెల్యే స్థానికుల సమస్యలను ఆరాతీశారు. రంజాన్ సందర్భంగా మసీదుల వద్ద పారిశుధ్యం, లైటింగ్ సమస్యల్లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2007లో టీడీపీ తరఫున ఎమ్మెల్సీలు గెలిచారని, అయితే 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. పార్టీని వీడి వెళ్తూ దుష్ప్రచారం చేయడం తగదని సూచించారు. ముగ్గురు ఎమ్మెల్యేలు వెళ్తే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఏదో నష్టం జరిగిందంటూ మాట్లాడటం తగదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకంతో ఎమ్మెల్యేలు ప్రసన్నకుమార్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి ప్రయాణం చేస్తున్నారని, 2024లోనూ భారీ మెజార్టీతో వీరు విజయం సాధిస్తారన్నారు. జిల్లాలో అందరూ కలిసికట్టుగా పనిచేసి అన్ని సీట్లను దక్కించుకుంటామని పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలను ఆరాతీస్తున్న రవి

నెల్లూరు రూరల్: జిల్లాలో ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవి పేర్కొన్నారు. వావిలేటిపాడులోని గిరిజన కాలనీని మంగళవారం సందర్శించిన ఆయన స్థానిక గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీటిని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేస్తాం



ఏడీకి వినతిపత్రమిస్తున్న రైతులు

నెల్లూరు(సెంట్రల్): కావలిలో వ్యవసాయ మార్కెటింగ్‌కు సంబంధించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని జిల్లా మార్కెటింగ్ ఏడీ అనితాకుమారి పేర్కొన్నారు. మార్కెటింగ్ ఏడీని కావలికి చెందిన పలువురు మంగళవారం కలిసి తమ సమస్యలను తెలియజేశారు. వీటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

ఐఏఎల్ జిల్లా సదస్సు జయప్రదానికి పిలుపు

నెల్లూరు(లీగల్): వచ్చే నెల ఒకటిన నిర్వహించనున్న ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) తొమ్మిదో జిల్లా సదస్సును జయప్రదం చేయాలని సంస్థ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టౌన్‌హాల్లో నిర్వహించనున్న సమావేశంలో న్యాయవాదుల సమస్యలపై చర్చించి తీర్మానాలను ఆమోదించనున్నామని చెప్పారు. సదస్సుకు న్యాయవాదులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

వేడుకగా అంకురార్పణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): గాంధీగిరిజన కాలనీలో కొలువైన రామాలయంలో సీతారాములస్వామి ఉత్సవాలకు అంకురార్పణను మంగళవారం చేపట్టారు. పెన్నా నుంచి జలాలను కలశంలో తీసుకొచ్చి ఉత్సవాలను ప్రారంభించారు. ఉభయకర్తలుగా తిరుమలయ్య, పుల్లమ్మ దంపతులు వ్యవహరించారు. ఎస్సై వెంకయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు వెంకటరమణ, ప్రభాకర్, రవి, చంద్ర, శ్రీనివాసులు, అర్చకుడు శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయ ఎదుట నిరసనను యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. అనంతరం మేనేజర్ ఇనాయతుల్లాకు వినతిపత్రాన్ని అందజేశారు. యూనియన్ నేతలు అశోక్, వజ్రమ్మ, సునీల్, మారుతి, దేశమూర్తి, కామాక్షమ్మ, లోకేష్, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



నెల్లూరు (అర్బన్): సేవ్ ది గర్ల్ చైల్డ్‌కు సంబంధించి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇటీవల వివిధ పాఠశాలల్లో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, పోస్టర్ ప్రజంటేషన్ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. సంతపేటలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు రూ.పది వేలు, రూ.ఐదు వేలు, రూ.మూడు వేలను చెక్కు రూపంలో అందించారు. డీఈఓ గంగాభవాని, సర్వశిక్ష అభియాన్ పీఓ ఉషారాణి, గైనకాలజిస్ట్ ప్రభావతి, డెమో అధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ ప్రక్రియ పరిశీలన



నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్ ప్రక్రియ జరుగుతోందని, దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్ పేర్కొన్నారు. గొల్లకందుకూరులోని సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ అప్‌డేట్‌ను ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆధార్ అప్‌డేట్ చేసుకోవడంతో చేకూరే ప్రయోజనాలను వివరించారు.

పోషణ్ పక్వాడా సంబరాలు



మాట్లాడుతున్న అన్నపూర్ణ

నెల్లూరు(వేదాయపాళెం): జాకీర్‌హుస్సేన్‌నగర్‌లోని మోడల్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా సంబరాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు అర్బన్ సీడీపీఓ అన్నపూర్ణ మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు చిరుధాన్యాల ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఏసీడీపీఓ లక్ష్మీదేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రమీలమ్మ, ఏఎన్‌ఎం లలిత, తదితరులు పాల్గొన్నారు.

పలువురికి పురస్కారాల ప్రదానం



నెల్లూరు(బృందావనం): అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు, సంగీత దర్శకుడు సాలూరు రాజేశ్వరరావు శత జయంత్యుత్సవం, ఉగాది పురస్కారాల ప్రదాన కార్యక్రమాన్ని నగరంలోని పురమందిరంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని చంద్రతేజాలయ మ్యూజిక్ అకాడమీ సంస్థ అధ్యక్షుడు, గాయకుడు చంద్రతేజ మాట్లాడారు. నెల్లూరుకు చెందిన శాంతా బయోటెక్ అధినేత వరప్రసాద్‌రెడ్డి ఆశీస్సులతో కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. కళ పత్రిక చీఫ్ ఎడిటర్ రఫీకి విశిష్ట సేవా ప్రపూర్ణ పురస్కారం, సీనియర్ గాయకుడు ప్రభుదాస్‌కు సాలూరు రాజేశ్వరరావు అవార్డు, హరినారాయణరెడ్డికి విశిష్ట సేవా పురస్కారం, హైదరాబాద్ కిన్నెర ఆర్ట్స్ సంస్థ సభ్యుడు రాధాకృష్ణ, డాక్టర్ శ్రీరామ్ మనోహర్‌బాబు, రేణిగుంట ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ రాజ్‌కిషోర్, నరసింహారెడ్డి, రత్నానికి ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. అనంతరం నిర్వహించిన సంగీత విభావరి వీనులవిందుగా సాగింది. నెల్లూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ రాజేశ్వరరెడ్డి, ఆర్డీఓ మలోల, సింహపురి సంస్కృతి సమాఖ్య వ్యవస్థాపక కార్యదర్శి రాంజీ, మురళీ మోహన్‌రావు పాల్గొన్నారు.

ఐసీబీ రాష్ట్ర కన్వీనర్‌గా రాజశేఖర్

నెల్లూరు(బృందావనం): ఇండియన్ క్రిస్టియన్ బోర్డు (ఐసీబీ) రాష్ట్ర ప్రధాన అధికార సమన్వయ కమిటీ కన్వీనర్‌గా నగరానికి చెందిన రెవరెండ్ రాజశేఖర్ నియమితులయ్యారు. విజయవాడలో మంగళవారం నిర్వహించిన ఐసీబీ రాష్ట్ర సమావేశంలో తనను నియమించారని చెప్పారు. తనకు పదవిని ఇచ్చిన వారికి కృతజ్ఞతలను తెలియజేశారు.

హోటళ్లలో తనిఖీలు

నెల్లూరు(బారకాసు): నగరంలోని పలు హోటళ్లలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ తనిఖీలను మంగళవారం చేపట్టారు. అక్కడ పనులు చేస్తున్న కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సర్టిఫికెట్లను పరిశీలించారు. స్వీట్ల తయారీ.. ఎక్స్‌పైరీ తేదీలను క్షుణ్ణంగా పరిశీలించారు. శానిటరీ సూపర్‌వైజర్ శేషయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొండమ్మ పాల్గొన్నారు.

మిస్ సింహపురికి సత్కారం



నెల్లూరు(బృందావనం): మినీబైపాస్ రోడ్డులోని జీపీఆర్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన అమ్మ ఫర్నిచర్ ఎగ్జిబిషన్‌ను మిస్ సింహపురి లతీఫా మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమెను అమ్మ ఫర్నిచర్ అధినేతలు సుధాకర్‌రెడ్డి, సుజన్‌రెడ్డి సత్కరించారు. బుధవారం వరకు ఎగ్జిబిషన్ ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సుధాకర్ రెడ్డి కోరారు.

బీజేపీలో కన్వీనర్ల నియామకం

నెల్లూరు(బారకాసు): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో బీజేపీ కన్వీనర్లను నియమిస్తూ ఉత్తర్వులను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మంగళవారం జారీ చేశారు. కందుకూరుకు నళిని, నెల్లూరు రూరల్‌కు రఘునందరాజు, సిటీకి మిడతల రమేష్, ఉదయగిరికి రంగారావు, ఆత్మకూరుకు సుధాకర్, కోవూరుకు రాఘవేంద్రరావు, సర్వేపల్లికి పద్మనాభరెడ్డిని కన్వీనర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రజక విభాగ రాష్ట్ర కన్వీనర్‌గా మస్తాన్‌బాబు

బీజేపీ రజక విభాగ రాష్ట్ర కన్వీనర్‌గా మస్తాన్‌బాబును పార్టీ రాష్ట్ర కమిటీ ఎంపిక చేసింది. ఈ మేరకు ఆ పార్టీ నేతలు ఒక ప్రకటనను విడుదల చేశారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న రవీంద్ర

నెల్లూరు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆసరా, సున్నా వడ్డీ, చేయూత, తదితర పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మెప్మా డైరెక్టర్ రవీంద్ర పేర్కొన్నారు. గాంధీబొమ్మ సమీపంలోని మహిళా స్వశక్తి భవనంలో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. బంగ్లాతోటకు చెందిన రత్నమ్మ జాతీయ స్థాయిలో రాఖీల విక్రయ స్టాల్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పి లాభాన్ని ఆర్జించారన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు శైలమ్మ, సీఎంఎం కాంతయ్య, సీఓలు చందన, గాయత్రి, గీతా, తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

నెల్లూరు(క్రైమ్): గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రోడ్డు దాటుతున్న వృద్ధురాలు మృతి చెందిన ఘటన గొలగమూడి క్రాస్‌రోడ్డు సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. మృతదేహాన్ని వాహనాలు తొక్కుకుంటూ వెళ్లడంతో ఛిద్రమై గుర్తుపట్టలేని విధంగా తయారైంది. సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఓ వృద్ధురాలు ఈ ప్రాంతంలో భిక్షాటన చేసుకుంటూ తిరిగేవారని, ఆమే అయి ఉండొచ్చని చుట్టుపక్కల వారు తెలియజేశారు. దీంతో ఆ దిశగా ట్రాఫిక్ పోలీసులు విచారణ జరుపుతున్నారు.

మహిళపై దాడి

నెల్లూరు(క్రైమ్): మహిళపై దాడి చేసిన ఘటనలో నిందితులపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వైఎస్సార్‌నగర్‌లో గౌసున్నీసా, బాషా దంపతులు నివాసం ఉంటున్నారు. గౌసున్నీసా చెల్లెలు గుల్జార్‌కు వివాహమై మనస్పర్థలతో భర్త నుంచి విడిపోయారు. వివాహానికి పెద్దమనిషిగా వ్యవహరించిన కరీమ్ అప్పటి నుంచి గౌసున్నీసాను సూటిపోటి మాటలనేవారు. ఈ నేపథ్యంలో కరీమ్, మరో వ్యక్తి, అతని కుటుంబసభ్యులు కలిసి గౌసున్నీసాపై దాడి చేసి చంపుతామని బెదిరించారు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేశారు.

సెల్‌ఫోన్ చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): సెల్‌ఫోన్ చోరీ కేసులో నిందితుడ్ని చిన్నబజార్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నవాబుపేటకు చెందిన ప్రశాంత్ ఆర్టీసీ సమీపంలోని పెంచలమ్మ హాస్పిటల్లో పనిచేస్తున్నారు. ఇటీవల ఆయన సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని దుండగుడు అపహరించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చిన్నబజార్ పోలీసులు కేసును నమోదు చేశారు. ఈ క్రమంలో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ప్రశాంత్‌కుమార్ వీఆర్సీ సెంటర్‌లో సెల్‌ఫోన్‌ను విక్రయించేందుకు మంగళవారం యత్నిస్తుండగా, అనుమానంతో చిన్నబజార్ ఎస్సై లేఖా ప్రియాంక అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తమదైన శైలిలో విచారించగా, హాస్పిటల్లో సెల్‌ఫోన్‌ను చోరీ చేసిన విషయాన్ని అంగీకరించారు. దీంతో అతడ్ని అరెస్ట్ చేసి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

హత్యాయత్నం కేసులో..

నెల్లూరు(క్రైమ్): అదనపు కట్నం కోసం భార్యను వేధించడమే కాకుండా హత్యాయత్నం చేసిన ఘటనలో నిందితుడ్ని నవాబుపేట పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నవాబుపేటలోని పుల్లమ్మసత్రానికి చెందిన విజయ్‌కుమార్, వెంకటకీర్తిప్రియ దంపతులు. అదనపు కట్నం కోసం కొద్ది రోజులుగా ఆమెను వేధించడం ప్రారంభించారు. చున్నీతో ఆమె గొంతు నులిమి హత్య చేసేందుకు యత్నించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడ్ని అరెస్ట్ చేశారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరు(క్రైమ్): అదనపు కట్నం కోసం వివాహితను వేధించడమే కాకుండా ఇంటి నుంచి తరిమేసిన భర్త, అత్తింటి వారిపై దిశ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. తోటపల్లిగూడూరు మండలం పొట్లపూడికి చెందిన అలివేణికి ఇందుకూరుపేట మండలం జంగందొరువుకు చెందిన వేణుతో 2009లో వివాహమైంది. ఆ సమయంలో ఆమె కుటుంబసభ్యులు రూ.ఐదు లక్షల కట్నం, 20 సవర్ల బంగారు ఆభరణాలు, గృహోపకరణాల కోసం రూ.రెండు లక్షలను ఇచ్చారు. కొంతకాలం వీరి కాపురం సజావుగా సాగింది. అనంతరం కలతలు చోటుచేసుకున్నాయి. వ్యసనాలకు బానిసైన భర్త తన కుటుంబ సభ్యులతో కలిసి అదనపు కట్నం కోసం వేధించసాగారు. ఈ ఏడాది జనవరిలో ఇంటి నుంచి అలివేణిని గెంటేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై శేఖర్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి మృతి



నెల్లూరు(క్రైమ్): స్నేహితులతో కలిసి మైపాడు బీచ్‌కు వెళ్లిన యువకుడు మృతి చెందిన ఘటనపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన శ్రీనివాసులు కుమారుడు శ్రీకాంత్ (32) ఎలక్ట్రిక్ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. అర్ధగంటలో ఇంటికొస్తానని చెప్పి స్నేహితుడు పవన్‌తో కలిసి శ్రీకాంత్ సోమవారం ఉదయం బయటకెళ్లారు. అనంతరం వీరిద్దరూ తమ స్నేహితులతో కలిసి మైపాడు బీచ్‌కు వెళ్లేందుకు నెల్లూరుకు రాత్రి వచ్చారు. నెల్లూరులో పూటుగా మద్యం సేవించి ఆటోలో బీచ్‌కు బయల్దేరారు. రాత్రి పూట బీచ్‌కు అనుమతి లేదని మార్గమధ్యలో చెప్పడంతో ప్రశాంతినగర్ వద్ద ఆటోను డ్రైవర్ దిగారు. అక్కడే సత్రం వద్ద నిద్రించారు. మంగళవారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో ప్యాంట్‌లో శ్రీకాంత్ మూత్ర విసర్జన చేసి ఉండటాన్ని పవన్ గమనించారు. పవన్, అతని స్నేహితులు కలిసి శ్రీకాంత్‌ను నిద్ర లేపేందుకు విఫలయత్నం చేశారు. దీంతో వారు 108కు సమాచారం అందించగా, వారు ఘటన స్థలానికి చేరుకొని శ్రీకాంత్‌ను పరిశీలించి మృతి చెందారని నిర్ధారించారు. ఈ మేరకు విషయాన్ని మృతుడి తమ్ముడు గణేష్‌కు ఫోన్లో తెలియజేశారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న నవాబుపేట ఎస్సై తిరుపతయ్య ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. నెల్లూరు చేరుకున్న మృతుడి అన్న నరేష్ తన తమ్ముడి మృతిపై విచారణ జరపాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో వాహన క్యాబిన్ దగ్ధం



నెల్లూరు(క్రైమ్): షార్ట్ సర్క్యూట్‌తో హైవే మెయింటెనెన్స్ వెహికల్ ఇంజిన్ దగ్ధమైంది. వివరాలు.. గూడూరు నుంచి జాతీయ రహదారిని పరిశీలిస్తూ కావలి వైపు ఎస్టీపీఎల్ హైవే మెయింటెనెన్స్ వెహికల్ బయల్దేరింది. ఈ క్రమంలో చింతారెడ్డిపాళెం క్రాస్‌రోడ్డు సమీపంలో ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూటై అగ్నిప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో డ్రైవర్‌తో పాటు క్యాబిన్‌లో ఉన్న మరో ఇద్దరు బయటకు దూకేశారు. సమీపంలో విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరమ్మ, ఎస్సై గీతారమ్య ప్రమాదాన్ని గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న వారు ఫోమ్, నీటితో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. క్యాబిన్ పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఘటనతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది.

దోపిడీ కేసులో నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): వృద్ధురాలిని నిర్బంధించి బంగారు ఆభరణాలను దోచుకెళ్లిన ఘటనలో ఇద్దరు నిందితులను నవాబుపేట పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నాగేంద్రనగర్‌లో వెంకటశేషమ్మ ఒంటరిగా నివాసం ఉంటున్నారు. అద్దెకు ఇల్లు కావాలంటూ ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఈ నెల 24న వచ్చి ఆమెను నిర్బంధించి రెండున్నర సవర్ల చైన్, అర సవర కమ్మలను దోచుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు పర్యవేక్షణలో ఎస్సై తిరుపతయ్య కేసు దర్యాప్తు చేపట్టారు. బాధితురాలు తెలిపిన వివరాలు, సమీపంలోని సీసీ పుటేజీల ఆధారంగా నిందితులను బంగ్లాతోటకు చెందిన అన్నదమ్ములు పవన్ కల్యాణ్ అలియాస్ కల్యాణ్, నవీన్‌గా గుర్తించి వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులను మైపాడు గేట్ సెంటర్‌లో అరెస్ట్ చేసి వారి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. వ్యసనాలకు బానిసై చోరీల బాట పట్టారని తెలిసింది. తొలిసారిగా దోపిడీ చేసి పోలీసులకు చిక్కి జైలుపాలయ్యారు.